ఆస్తి పన్నులు వందశాతం వసూలు చేయాలి: కమిషనర్

కార్పొరేషన్, ఫిబ్రవరి 21 : నగరంలో ఆస్తి పన్నులు వందశాతం వసూలు చేయాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణితో కలిసి కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సమయం చాలా తక్కువగా ఉన్నందున సెలవు దినాల్లో కూడా పన్నులను వసూలు చేయాలని కోరారు. మొండి బాకాయి దారులపై ఒత్తిడి తేవాలన్నారు. డివిజన్ వారీగా బకాయి దారుల పేర్లను అనౌన్స్ చేయాలని ఆదేశించారు. బకాయి దారుల కోసం నగరపాలక సంస్థలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి లిస్టు ఆధారంగా కాల్స్ చేసి పన్నులు కట్టించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వార్డు ఆఫీసర్లు కొత్త ట్రేడ్ లైసెన్స్ కట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగర ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి.. నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐలు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

గణితంలో 'వివేకానంద' విద్యార్థి రికార్డు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 21 : జిల్లా కేంద్రంలోని వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్ ఏడో తరగతి విద్యార్థి మనీష్ రావు, ఇంటర్నేషనల్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ 2025లో కొత్త రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలో సూపర్ మెమరీ చాంప్ బిరుదును పొందినట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ టి. లలిత కుమారి పేర్కొన్నారు. 1 నుంచి 200 వరకు ఉన్న అన్ని సంఖ్యల గణిత ఘనాలు, చతురస్రాలను దోషరహితంగా పఠించడం ద్వారా అద్భుతమైన ఘనత సాధించినట్లు తెలిపారు. ఈ రికార్డు సృష్టించిన కార్యక్రమాన్ని జీనియస్ బుక్స్ ఆఫ్ రికార్డ్స్ నిర్వహించగా, మనీష్ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ఫలితంగా అతడికి ఈ విజయం సాధ్యమైందన్నారు. సూపర్ మెమరీ చాంప్ సాధించిన విద్యార్థిని వీఆర్ఎస్ చైర్మన్ సుధాకర్ రావు పోల్సాని, డైరెక్టర్ (అకాడమిక్) డాక్టర్ టి. లలిత కుమారి, ప్రిన్సిపాల్ రేణుకా బలివాడ పాఠశాలలో విద్యార్థిని అభినందించి సన్మానించారు.

సహకార సంఘాల్లో అందుబాటులో యూరియా: ఏడీఏ

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 21: హుజూరాబాద్ డివిజన్‌లోని వివిధ ప్రాథమిక సహకార సంఘాల్లో యూరియా అందుబాటులో ఉందని హుజూరాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 167 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేసేందుకు తెప్పించినట్లు పేర్కొన్నారు. రైతులు తమ పరిధిలోని సహకార సంఘాల ద్వారా యూరియాను కొనుగోలు చేయాలని కోరారు. యూరియా సరఫరా నిరంతరాయంగా ఉండేలా చూస్తున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

ఘనంగా శ్రీ మాత జయంతి

కార్యక్రమంలో పాల్గొన్న ప్రసాదరావు, తదితరులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 21 : జిల్లా కేంద్రంలోని పారమిత హెరిటేజ్ స్కూల్‌లో శ్రీ అరవిందో సొసైటీ కరీంనగర్ సెంటర్ ఆధ్వర్యంలో శ్రీ మాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పారమిత విద్యా సంస్థల చైర్మన్ ఇ ప్రసాద రావు మాట్లాడుతూ, మదర్ అని పేరొందిన మిర్రా అల్ఫాస్సా జయంతిని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అరబిందో సొసైటీ నిర్వాహకులు సబ్బని లక్ష్మీ నారాయణ, కోల అన్నారెడ్డి, ప్రిన్సిపాల్ హనుమంత రావు, డైరెక్టర్లు రమణ, నీలిమ, కాసం శివ కుమార్, చంద్ర మోహన్ రావు, రాజశేఖర్, పులాల శ్యామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగికి తీవ్రగాయాలు

గన్నేరువరం, ఫిబ్రవరి 21: జంగపల్లి క్రాసింగ్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాలిపల్లి వనితకు తీవ్ర గాయాలయ్యాయి. విద్యాశాఖలో మండలంలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తున్న వనిత, గుండ్లపల్లి స్టేజీ నుంచి పారువెల్లకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జంగపల్లి క్రాసింగ్ రహదారి పక్కన ఉన్న మామిడి తోట నుంచి అడవి పంది దూసుకొచ్చి వాహనాన్ని ఢీకొన్నది. వనిత వాహనం పైనుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు సమీపంలో గల ప్రభుత్వ పాఠశాలకు తీసుకొచ్చి, అక్కడ నుంచి కొమ్మెర రవీందర్ రెడ్డి అంబులెన్స్‌లో చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ హాస్పిటల్‌కు తరలించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

• రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి

కలెక్టరేట్, ఫిబ్రవరి 21: ఉత్తర తెలంగాణ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న జరుగనుండగా, పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ కూడా అందించినట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై శుక్రవారం హైద్రాబాద్‌నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో భాగంగా 36 మంది మైక్రో అబ్జర్వర్లు, 373 మంది పోలింగ్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 30 లొకేషన్లలో 103 పోలింగ్ కేంద్రాలున్నట్లు వివరించారు. పోలింగ్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియ పూర్తికావచ్చినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సామగ్రి పంపేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు. ఇందుకోసం అవసరమైన ఐదు వాహనాలు సిద్ధంగా ఉన్నాయని, పోలింగ్ అనంతరం వివిధ జిల్లాల నుంచి కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు నగరంలో అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. బ్యాలెట్ బాక్సుల స్వీకరణలో రిసెప్షన్ కౌంటర్ వద్ద జాప్యం కలుగకుండా అవసరమైన

బ్యాలెట్ పేపర్ల బెండల్స్ పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి

చర్యలు చేపట్టామన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల స్థానాలకు వేర్వేరుగా రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. అంతకుముందు ఎస్ఈసీ మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనావళి, నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉదయం 7.30 గంటలకే మాక్ పోలింగ్ నిర్వహించాలని, 8 గంటల నుంచి పోలింగ్ ప్రారంభించాలని సూచించారు. ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ వివరాలు వెల్లడించాలని, పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులు రిసెప్షన్ కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్ల పరిశీలన

కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల బ్యాలెట్ పేపర్లు శుక్రవారం ఎన్నికల సిబ్బంది పరిశీలించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన పరిశీలనలో ఎన్నికల సంఘం నుంచి ఉదయం జిల్లా కేంద్రానికి చేరిన బ్యాలెట్ పేపర్లను సిబ్బంది అభ్యర్థుల సమక్షంలో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, ప్రతి బ్యాలెట్ పేపర్ పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఎలాంటి రిమార్కులున్నా వెంటనే నిర్ణీత ఫారంలో రాసి, బ్యాలెట్ పేపర్ వరుస సంఖ్యను నమోదు చేయాలన్నారు. పేపర్లపై ఉన్న సీరియల్ నంబర్లు, అభ్యర్థుల ఫొటోలు, ఇతర వివరాలు అభ్యర్థులు, వారి వైపు నుంచి వచ్చిన ఏజెంట్లు కూడా తనిఖీ చేస్తున్న విధానం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో కె.మహేశ్వర్‌తో పాటు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 21 : పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం పదో తరగతి పరీక్షలపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు ఓరియంటేషన్ శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, నిబంధనలు అనుసరించి 10వ తరగతి పరీక్షలు సాఫీగా సాగేలా చూడాలని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

సైనిక్ పాఠశాలలో విద్యార్థుల ఘర్షణ

'పది' విద్యార్థులను చితకబాదిన ఇంటర్మీడియట్ స్టూడెంట్స్

చొప్పదండి, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల సైనిక్ పాఠశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఇంటర్మీడియట్ విద్యార్థులు పదో తరగతి విద్యార్థులను చితకబాదిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ గోప్యంగా ఉంచి విద్యార్థులకు వైద్య సేవలందించినట్లు సమాచారం. ఈనెల 20న సాయంత్రం ఇంటర్మీడియట్ విద్యార్థులు 10 మంది కలిసి పదో తరగతి చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులపై భౌతిక దాడి చేశారు. ఈ ఘటనలో కొందరికి గాయాలు కాగా, రాత్రి కరీంనగర్ దవాఖానకు తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. విషయం తెలిసిన తల్లిదండ్రులు శుక్రవారం మధ్యాహ్నం సైనిక్ పాఠశాలకు చేరుకొని ఆందోళన చేశారు. ఘటనా స్థలాన్ని ఎస్సై గొల్లపల్లి అనూష చేరుకొని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో మాట్లాడారు. కాగా, గతంలో కూడా పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 8వ తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులపై దాడి చేసిన ఘటన కూడా చోటుచేసుకుంది. కాగా, పాఠశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారులు ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

'బదులు' కార్మికుల వివరాలు నమోదు

కార్పొరేషన్, ఫిబ్రవరి 21: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య విభాగంలో ఒకరి పేరుపై మరొకరు పని చేస్తున్న (బదులు) కార్మికులను శుక్రవారం ఉన్నతాధికారులు కార్యాలయానికి పిలిపించారు. ఎందుకు విధుల్లోకి రాకుండా కుటుంబ సభ్యులను పంపిస్తున్నారన్న వివరాలను సేకరించారు. కాగా, పారిశుధ్య విభాగంలో సుమారు 50 మంది మేరకు ఈ బదులు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారని తెలుస్తున్నది. వీరిలో రెగ్యులర్ కార్మికులతో పాటు, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న కార్మికులు సైతం ఉన్నారు. కాగా, విధి నిర్వహణలో ఉండగా జరిగిన ప్రమాదాల్లో వైకల్యం కలుగడం వల్లే తమకు బదులుగా కుటుంబ సభ్యులు పనులు చేస్తున్నట్లు పలువురు కార్మికులు పేర్కొంటున్నారు. కాగా, ఇప్పుడు వీరిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపడుతారన్నది అంతటా ఆసక్తిని రేపుతున్నది. ఈ విషయంలో ఆ విభాగం అధికారులను సంప్రదించగా, కమిషనర్ ఆదేశాల మేరకు ఇలాంటి వారి వివరాలు నమోదు చేసుకున్నామని, వాటిని కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కాగా, నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్, నీటి నిర్వహణ, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల్లోనూ ఔట్ సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగుల స్థానాల్లో బదులు పద్ధతిలో పని చేస్తున్న వారి విషయంలోనూ ఉన్నతాధికారులు దృష్టి పెడుతారా? అన్న చర్చ మొదలైంది.

వికసిత్ భారత్‌కు అనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులు

విద్యానగర్, ఫిబ్రవరి 21 : 2047 నాటికి వికసిత్ భారత్ (అభివృద్ధి చెందిన భారతదేశం) లక్ష్యానికి అనుగుణంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, దేశ స్థితిగతిని మార్చే విధంగా అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, పార్లమెంటు సభ్యురాలు దగ్గుపాటి పురందరేశ్వరి పేర్కొన్నారు. 2025- 2026 కేంద్ర బడ్జెట్‌పై శుక్రవారం కరీంనగర్‌లోని వైశ్య భవన్‌లో మేధావులతో సదస్సుకు పురందరేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు కరీంనగర్‌లోని శ్వేతా హోటల్లో బడ్జెట్ కేటాయింపుల అంశంపై మీడియాతో మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులపై తగిన అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వికసిత్ భారత్ బడ్జెట్ ప్రోగ్రాం స్టేట్ కోఆర్డినేటర్ గంగిడి మనోహర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, తాజా మాజీ మేయర్ సునీల్ రావు తదితరులు పాల్గొన్నారు.

రజనిశ్రీ సాహిత్య పురస్కారానికి కవితా సంకలనాల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 21: ప్రముఖ కవి, నాట్యాచార్యుడు రజనిశ్రీ పేరు మీద జాతీయ సాహిత్య పరిషత్- కరీంనగర్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సాహిత్య పురస్కారాన్ని రజనిశ్రీ కుమారుడు, సాహితీవేత్త, మహాత్మా జ్యోతిబా ఫూలే రెసిడెన్షియల్ పాఠశాలల సంయుక్త కార్యదర్శి జీవీ శ్యాంప్రసాద్ లాల్ అందజేస్తున్నారు. ఈ సంవత్సరం పురస్కారానికి కేవలం కవిత్వంలో పద్య, గేయ, వచన కవితల సంకలనాలు మాత్రమే పంపాలని ఎంపిక కమిటీ బాధ్యుడు జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్ ఒక ప్రకటనలో కోరారు. కవులు తమ కవితా సంకలనాలు 2022 జనవరి నుంచి 2024 డిసెంబర్ వరకు ముద్రితమైనవి నాలుగు ప్రతులను గాజుల రవీందర్, ఇంటి నంబర్ 8-3-255/1, రామచంద్రాపూర్ కాలనీ, రోడ్ నంబర్ 12, భగత్ నగర్, కరీంనగర్ -505001 చిరునామాకు మార్చి 20, 2025లోగా పంపాలని తెలిపారు. మరిన్ని వివరాలకు గాజుల రవీందర్ 98482 55525 లేదా నంది శ్రీనివాస్ 94904 01861 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బీఆర్ఎస్ నాయకుడికి వీర్ల పరామర్శ

మోతెలో దర్శనాల మునీందర్‌ను పరామర్శిస్తున్న వీర్ల వెంకటేశ్వరరావు

రామడుగు, ఫిబ్రవరి 21 : మండలంలోని మోతె బీఆర్ఎస్ పార్టీ గ్రామాధ్యక్షుడు దర్శనాల మునీందర్ తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆయనతో పాటు కుటుంబ సభ్యులను శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు మండల నాయకులతో కలిసి పరామర్శించారు. లక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఇక్కడ పార్టీ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మోతె మాజీ సర్పంచ్ ఊకంటి చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు జూపాక మునీందర్, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, ఉదారపు లక్ష్మీనారాయణ, బండారి ప్రవీణ్, నేరెళ్ల సురేశ్, మామిడి పెల్లి సాయి తదితరులు ఉన్నారు.

టీఎన్జీవోల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి స్వాగతం

కొత్తపల్లి, ఫిబ్రవరి 21: టీఎన్జీవోల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ శుక్రవారం నగరంలోని టీఎన్జీవో భవన్‌కు రాగా, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణరావు స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మారం జగదీశ్వర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తెలంగాణ ఎన్జీవోల సంఘం 80వ వార్షిక వేడుకలను హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో టీఎన్జీవో నాయకులు నాగులు నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ హర్మీందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మండల యువకుడికి అరుదైన ఆహ్వానం

దూలం సురేశ్

వీణవంక, ఫిబ్రవరి 21: గుజరాత్‌లో జరిగే బోర్డర్ ఏరియా యూత్ ఎక్స్చేంజ్ కార్యక్రమానికి మండలానికి చెందిన యువకుడు దూలం సురేశ్‌కు ఆహ్వానం అందింది. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ గుజరాత్ ఎన్వైకేఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 28 వరకు ఇండియా-పాకిస్థాన్ బోర్డర్ కచ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి 29 రాష్ట్రాల నుంచి క్రీడాకారులను ఎంపిక చేయగా, ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆరుగురికి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువచైతన్య యూత్‌క్లబ్ సభ్యుడు దూలం సురేశ్‌కు చోటు దక్కిందని జిల్లా యువజన అధికారి వెంకటరాంబాబు ప్రకటనలో తెలిపారు. దూలం సురేశ్ అరుదైన ఆహ్వానం అందుకోవడంపై యూత్‌క్లబ్ అధ్యక్షుడు కర్రె నాని, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బీసీలు రాజ్యాధికార సాధనకు పోరాడాలి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 21: బీసీలు రాజ్యాధికారం సాధించే వరకూ పోరాడాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ పిలుపు నిచ్చారు. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీలు ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకోవాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్క కొమురయ్యకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఆయనకు పూర్తి అవగాహన ఉన్నదని, ఎన్నికల్లో గెలిపిస్తే వాటిని పరిష్కరించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, రాజు, కుమార్ పాల్గొన్నారు.

ప్రాచీన రంగస్థల కళా రూపాలను కాపాడుకుందాం

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 21: ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి దోహదం చేసే యక్షగానం, నాటకం, చిరుతల రామాయణం లాంటి ప్రాచీన రంగస్థల కళా రూపాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రచయితలు గాజోజు నాగభూషణం, కందుకూరి అంజయ్య, అన్నవరం దేవేందర్, కూకట్ల తిరుపతి, దామర కుంట శంకరయ్య, శ్రీమంతుల సదాశ్రీ, కోల రామచంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మానకొండూర్ మండలం మద్దికుంట గ్రామంలో ప్రదర్శించే సత్య హరిశ్చంద్ర వీధి బాగోతం గోడపత్రికను రచయితలు కరీంనగర్ ఫిలిం సొసైటీ భవన్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. మద్దికుంట పంచాయతీ ఆవరణలో శ్రీ శివమారుతి భజన మండలి ఆధ్వర్యంలో సాయంత్రం ఏడు గంటలకు ఈ యక్షగాన ప్రదర్శన ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. కళాకారులందరూ పాల్గొని నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.

'ఉపాధి లేదు.. సాండ్ టాక్స్ పెట్టండి'

తిమ్మాపూర్,ఫిబ్రవరి21: 'ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నాం. సాండ్ టాక్స్' పెట్టండి అంటూ జిల్లా మైనింగ్ అధికారికి రేణిగుంట గ్రామస్తులు శనివారం వినతి పత్రం సమర్పించారు. రేణికుంట శివారులో మోయతుమ్మెద వాగులో గతంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో సాండ్ టాక్స్ నిర్వహించారని, అప్పుడు ప్రత్యక్షంగా పరోక్షంగా ట్రాక్టర్లు, డ్రైవర్లు, లేబర్లు గ్రామానికి చెందిన ఎంతోమంది ఉపాధి పొందామని చెప్పారు. సాండ్ టాక్స్ ఏర్పాటు చేసి తమకు ఉపాధి కల్పించాలని కోరారు. ఇక్కడ తమనవేణి శ్రీనివాస్, గుంతక మహేశ్, కుంభం శ్రీకాంత్, ఎలక సుమన్, హరీశ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 21 : జిల్లా కేంద్రంలోని పలు విద్యాసంస్థల్లో జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా, శాతవాహన విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాలలో తెలుగు, ఉర్దూ, ఆంగ్ల విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సూరేపల్లి సుజాత, ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ మాట్లాడుతూ, మాతృభాష ప్రాముఖ్యత వివరించారు. అలాగే, జిల్లా కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ గంద్ర మహేశ్ విస్తృత ఉపన్యాసం ఇచ్చారు. మాతృభాషను కాపాడుకోవాల్సిన అవసరాన్ని గురించి తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కలువకుంట రామకృష్ణ, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో విద్యార్థులు 'భాషల్లో ఐక్యత' అంశంపై నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 13: నగునూర్‌లోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. మాలతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సమత, తెలుగు అధ్యాపకులు ఎర్రోజు వెంకటేశ్వర్లు, సీహెచ్ కవిత, ఏ రేణుక, ఇతర అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని జయప్రదం చేయాలి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 21: నగరంలోని సైన్స్ వింగ్ కాలేజీ ఎదురు వీధిలో గల శ్రీసత్యసాయి సేవా మందిరంలో ఈనెల 23న నిర్వహించనున్న రక్త నాళాల ఉచిత వైద్య శిబిరాన్ని జయప్రదం చేయాలని శ్రీసత్యసాయి సేవా సంస్థల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాత్తెపు లింగమూర్తి కోరారు. నగరంలోని శ్రీసత్యసాయి మందిరంలో శుక్రవారం జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ వాస్కులర్ హాస్పిటల్ సౌజన్యంతో రూ.5 వేల విలువైన రక్త నాళాల సర్జన్, కన్సల్టేషన్ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం పది నుంచి సాయంత్రం మూడు గంటలవరకు వైద్య సేవలు కొనసాగుతాయన్నారు. నగర ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చిగురుమామిడి, ఫిబ్రవరి 21: మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో 6.50 కింటాళ్ల పీడీఎస్ బియ్యం పటుకున్నట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. కొండాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు టాటా ఏస్ ((ఏపీ 15 టీఏ 7630)లో అక్రమంగా బియ్యం తరలిస్తుండగా, ఉల్లంపల్లి బస్టాండ్ వద్ద పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ పోలీస్ స్పెషల్ డ్రైవ్

రాంనగర్, ఫిబ్రవరి 21: ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో 70 వరకు నంబర్ ప్లేట్ లేని వాహనాలపై జరిమానా విధించారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ సీఐలు కరీముల్